క్లుప్తంగా

నిర్బంధానికి తలవంచని వీరుడు.. సాయిబాబా

ఒంగోలు టౌన్: నిర్బంధానికి తలవంచని వీరుడు ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా అని, అతని మరణం భారత విప్లవోద్యమానికి తీరని లోటని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు కొనియాడారు. మానవ హక్కుల వేదిక కార్యకర్త, మేధావి, ప్రొఫెసర్ సాయిబాబా మరణం పట్ల సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సాయిబాబా మరణం పట్ల వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మావోయిస్టు పార్టీతో సంబంధాలున్నట్లు ఆరోపిస్తూ ఆయనను 2014లో పోలీసులు అరెస్టు చేసి అండా జైలులో పెట్టినప్పటికీ ఆయన బెదరలేదని, తన స్వరాన్ని, సిద్ధాంతాన్ని మార్చుకోలేదని తెలిపారు. జైలులో అనేక రకాలైన అనారోగ్య సమస్యలెదురైనప్పటికీ ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఆదివాసి ప్రజల పక్షపాతిగా, తాడిత, పీడిత, దళితుల హక్కుల జెండాగా చివరి శ్వాస వరకు నిబ్బరంగా నిలిచారన్నారు. 5 ఏళ్ల వయసులోనే పోలియో బారిన పడి రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ.. ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ఉన్నత చదువులతో ఉన్నత శిఖరాలను అధిరోహించారని కొనియాడారు. జైలులో ఆయనకు ప్రభుత్వం సక్రమంగా వైద్య సహాయం అందించలేదని, చలికాలంలో కప్పుకునేందుకు కనీసం దుప్పటి కూడా ఇవ్వకుండా వేధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా పోరాట పటిమను నేటి తరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది

ఒంగోలు టౌన్: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం చాలా గొప్పదని, డొక్కా సీతమ్మ స్ఫూర్తితో నగరంలో అన్నదానం చేయడం అభినందనీయమని జనసేన నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని లాయర్‌పేటలో జనసేన నాయకుడు జడా నాగేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలినేని కుటుంబం తరఫున అన్నదానానికి ఆర్థికంగా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో మాజీ మంత్రి శిద్దా అన్నసంతర్పణ...

ఒంగోలు సిటీ: విజయదశమి పండుగను పురస్కరించుకొని స్థానిక లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు ఆదివారం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శిద్దా రాఘవరావు దంపతులకు స్వాగతం పలికి స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించి పుష్పమాలతో గౌరవించి వేద ఆశీర్వచనాలు అందజేశారు. షిర్డీ సాయి కల్చరల్ మిషన్ కమిటీ సభ్యులు మల్లాది వెంకట సుబ్బలక్ష్మమ్మ, శ్రీధర్‌రెడ్డి, డాక్టరు వరప్రసాదరావు, గంజాం విజయశివకుమార్, మెడా జయరాజ్, వాసు సాయిరాజ్, సాయిబాబా, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎడమ కాలువకు నీటి విడుదల
- కాలువ నిర్మాణం చివరి వరకూ పూర్తికాకపోవడంతో పొలాల్లోకి భారీగా చేరిన నీరు
- మాచవరం గ్రామంలో నీట మునిగిన 320 ఎకరాలు
- పంటలు సాగుచేసే అవకాశం లేకపోవడంతో ఆందోళనలో రైతులు
- కాలువ నిర్మాణాన్ని పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని వేడుకోలు


నీరు నిలిచి చెరువును తలపిస్తున్న మాచవరం గ్రామ రైతుల పొలాలు


ప్రవాహం లేక నీటితో నిలిచిపోయిన 15ఆర్ కాలువ

కాలువ తెచ్చిన కన్నీళ్లు..!

నాగులుప్పలపాడు:

గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎడమ కాలువకు నీరు విడుదల చేయడంతో కొందరు రైతులకు మేలు జరుగుతుండగా, మరికొందరు రైతులకు మాత్రం తీరని నష్టం కలిగిస్తోంది. ఎగువన కురిసిన భారీ వర్షాలకు గుండ్లకమ్మ ప్రాజెక్టుకు వరద నీరు చేరడంతో కుడి, ఎడమ కాలువలకు నీరు వదిలారు. ఎడమ కాలువ కింద నాగులుప్పలపాడు మండలంలో సుమారు 40 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పుడిప్పుడే మిరప పంట కూడా సాగవుతోంది.

దాంతో పాటు వరి పంట, పొగాకు కూడా పూర్తిగా సాగైతే ఎడమ కాలువకు విడుదల చేసే నీరు పూర్తిస్థాయిలో రైతులకు ఉపయోగపడుతుంది. కానీ, ప్రస్తుతం మిరప పంట కూడా పూర్తిస్థాయిలో సాగులో లేనప్పటికీ.. అధిక వర్షాల వలన ఎగువ నుంచి గుండ్లకమ్మ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో రావడం వలన అవుట్ ఫ్లో ద్వారా కుడి, ఎడమ కాలువలకు నీరు విడుదల చేశారు. ఎడమ కాలువ పరిధిలోని అనుబంధ కాలువలకు కూడా అధికారులు నీరు విడుదల చేశారు. దీనివలన తాము తీవ్రంగా నష్టపోతున్నామంటూ కొంత మంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

15ఆర్ కాలువ పూర్తికాకపోవడంతో తిప్పలు...

నాగులుప్పలపాడు, ఓబన్నపాలెం మీదగా ఉప్పుగుండూరు–మాచవరం పొలాల మధ్యలో ఉండే 15ఆర్ కాలువ నిర్మాణం ఆ కాలువ చివరి వరకూ పూర్తికాకపోవడంతో ఉప్పుగుండూరు గ్రామ రైతులు లాకులు బిగించి తమ మెట్ట పొలాల్లో కూడా మాగాణి సాగు చేస్తున్నారు. ఈ ప్రక్రియ మాచవరం గ్రామ పొలాల్లో ఉన్న 320 ఎకరాల రైతులకు శాపంగా మరింది. మాగాణి పంట కోసం 15ఆర్ కాలువలకు లాకులు బిగించడం, సరైన తూములు నిర్మించకపోవడం, డొంకలను కూడా రోడ్లుగా మార్చివేయడంతో పైనుంచి దిగువకు వచ్చే నీరు వెళ్లే మార్గం లేక ఆ నీరంతా పంట పొలాల్లోకి చేరింది. నిరంతరం నీరు పారుతుండటంతో మాచవరం గ్రామ పొలాల్లో ఇప్పట్లో తడి ఆరిపోయే అవకాశం లేకుండా పోయింది. దీంతో రైతులు గత రెండేళ్ల నుంచి సక్రమంగా పంటలు పండించలేక నష్టపోతున్నారు.

ఇప్పటికైనా గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులు స్పందించి 15ఆర్ కాలువను దిగువ వరకు పూర్తి చేసి నీటి ప్రవాహానికి మార్గం చూపించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. తద్వారా దిగువ ప్రాంతంలో బీళ్లుగా మారుతున్న 300 ఎకరాల మెట్ట భూములను సాగు చేయడానికి కూడా వీలవుతుందని రైతులు కోరుతున్నారు.


మాచవరం రైతుల పొలాల మీదుగా ఇతర కాలువలకు ప్రవహిస్తున్న నీరు

కొందరి స్వార్థం వలన మా పొలాలు మునిగాయి



నాగులుప్పలపాడు నుంచి వచ్చే నీరంతా మా చేల మీదుగా దిగువకు వెళ్తోంది. కాలువ లు సరిగా లేకపోవడం, వీటికి తోడు కొంత మంది మాగాణి సాగు చేసుకోవడానికి స్వార్థంగా నీటి పారుదల ఆపడంతో ఆ ఉరవడి అంతా మా పొలాలపై పడుతోంది. కాలువలో నీరు వెళ్లే మార్గం లేక మా పొలాల మీదుగా ప్రవహిస్తుంటే మా పొలాలు ఎప్పటికి ఆరాలి.. మేం పంటలు ఎలా పండించాలి..? మెట్ట పొలాలను మాగాణి భూములుగా మారుస్తుండటంతో కొంత మేర ఈ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా గుండ్లకమ్మ అధికారులు తగిన చర్యలు చేపడితేనే మా పొలాలను మేము సాగుచేసుకోగలం.

– కృష్ణారెడ్డి, బాధిత రైతు, మాచవరం

మా పొలాల గురించి కూడా అధికారులు ఆలోచించాలి



మా తాతల నుంచి సంక్రమించిన పొలాలు మావి. ఆరుతడి పంటలుగా ప్రతి ఏడాది ఏదో పంట సాగుచేసేవాళ్లం. గుండ్లకమ్మ ఎడమ కాలువ పొడిగింపు పూర్తికాకపోవడంతో పైనుంచి వచ్చే నీటి పారుదల అవకాశం లేక మాచేలపై నిరంతరం ప్రవహిస్తోంది. మా చేలు ఎండేలా లేవు. ఇలా అయితే మా చేలను ఎలా పండించాలో.. మేం ఎలా జీవించాలో అర్థం కావడం లేదు. అధికారులు మా పొలాల గురించి కూడా ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాలి.

– ఇనగంటి వెంకటేశ్వరరెడ్డి, బాధిత రైతు, మాచవరం

ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం

వాస్తవానికి గుండ్లకమ్మ కాలువల్లో 15ఆర్ కాలువ పరిధిలో వరి సాగుకు అవకాశం లేదు. ఇది కేవలం ఆరు తడి, మెట్ట పైర్లకు మాత్రమే ఏర్పాటు చేసిన కాలువ. కానీ, కొందరు రైతులు కట్టలు బిగించి వరి సాగు చేయడం వలన మిగతా రైతులకు ఆటంకం కలుగుతోంది. ఈ విషయం మా దృష్టికి వచ్చింది. ఈ ఏడాది వ్యవసాయ సీజన్ అనంతరం ఈ సమస్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తాం. మెట్ట పైర్లు సాగు చేసే రైతుల పొలాలకు ఇబ్బంది లేకుండా అవకాశం ఉన్నంత మేరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం.

– నరసింహారావు, జేఈ, గుండ్లకమ్మ ఎడమ కాలువ

బూచేపల్లి ఇంట దసరా సందడి


పేదలకు కానుకలు అందిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి


బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డిని కలిసి సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ మర్రిపూడి మండల నాయకులు


బూచేపల్లి నివాసానికి వచ్చిన వందలాది మంది పేదలు

- భారీగా తరలివచ్చిన పేదలకు కానుకల అందజేత
- వలు మండలాల నుంచి వచ్చి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి: దసరా పర్వదినం సందర్భంగా చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో శుక్రవారం రాత్రి నుంచే సందడి నెలకొంది. పేదలు అధిక సంఖ్యలో బూచేపల్లి నివాసానికి రాగా, వారందరికీ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా దసరా కానుకలు అందించారు. ప్రజలంతా విజయదశమి వేడుకలను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. పలు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.

వివాహానికి హాజరైన బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మ

చీమకుర్తి రూరల్: మండలంలోని పల్లామల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రామసాని సూర్యచంద్రరావు తమ్ముడు కుమార్తె సుధాదీప్తి వివాహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై వధువును ఆశీర్వదించారు.


వధువును ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

వైద్య విద్యార్థినికి బూచేపల్లి ఆర్థికసాయం

చీమకుర్తి: కర్నూలు జిల్లా విశ్వభారతి మెడికల్ కాలేజీలో మెడికల్ సీటు సాధించిన బత్తుల నిత్యశ్రీకి బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ తరఫున జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. చీమకుర్తి అంబేడ్కర్ నగర్‌కు చెందిన బత్తుల రవి కుమార్తె అయిన నిత్యశ్రీకి మెడికల్ కాలేజీలో ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తాము ఆర్థిక సాయం అందించినట్లు బూచేపల్లి తెలిపారు. పేద విద్యార్థులకు ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ తప్పెట బాబూరావు పాల్గొన్నారు.


నిత్యశ్రీకి ఆర్థిక సాయం అందిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి

పంచాయతీలకు సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవాలా..?

ఒంగోలు టౌన్: ఉపాధి పనుల మంజూరు, నిర్వహణ గురించి సర్పంచులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పల్లెపండుగలో ప్రారంభోత్సవాలను ఎలా నిర్వహిస్తారని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. వీరభద్రాచారి ఆదివారం ఒక ప్రకటనలో నిలదీశారు. అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నానని పేర్కొన్న ఆయన..పనుల మంజూరు గురించి అధికారులు నేటి వరకు సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. గ్రామ సర్పంచ్, పాలకవర్గం చేసిన తీర్మానాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధిలో కీలకమైన ఉపాధి హామీ చట్టాన్ని నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో సగానికిపైగా పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న ఉపాధి హామీ నిధులే దిక్కయ్యాయని, సోషల్ ఆడిట్ పేరుతో అధికారులు అవినీతికి పాల్పడుతూ ఉపాధి హామీ ఉద్దేశాన్ని దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. సోషల్ ఆడిట్ విధానంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని కోరారు.


జమ్మిచెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు


చీమకుర్తి హరిహరక్షేత్రంలో లలితా సహస్రనామార్చనలో మహిళా భక్తులు


ఒంగోలు గొడుగుపాలెంలో దసరా పార్వేటలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా ముగిసిన దసరా ఉత్సవాలు

ఒంగోలు మెట్రో: దసరా ఉత్సవాలు శనివారంతో వైభవంగా ముగిసాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన దేవీశరన్నవరాత్రి మహోత్సవాలలో రోజుకో అలంకరణలో ఆలయాల్లో అమ్మవారు పూజలందుకుని భక్తులకు దర్శనమిచ్చారు. విజయదశమి పండుగ పర్వదినం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఒంగోలు లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న రాజరాజేశ్వరీదేవి బంగారు చీరలో దర్శనమిచ్చారు. గొడుగుపాలెంలో సాయంత్రం పార్వేట మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. నగరంలోని ప్రధాన దేవాలయాల నుంచి ఉత్సవమూర్తులు రథాలపై ప్రధాన వీధుల మీదుగా పారువేటకు చేరుకున్నారు. ఆలయాల్లో అమ్మవారి దర్శనానికి భక్తులు బారులదీరారు. సాయంత్రం గొడుగుపాలెంలోని జమ్మి వృక్షాన్ని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు: స్థానిక త్రిపురాంతకస్వామి ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంబళ్లగుంట వాగు సమీపంలో గల పోలేరమ్మ ఆలయంలో, పేర్నమిట్టలోని పోలేరమ్మ ఆలయంలో, ముద్రగడ్డ బజార్లోని అంకాలమ్మ తల్లి దేవస్థానంలో, స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో, జెండా చెట్టు వీరాంజనేయస్వామికి విజయదశమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: విజయదశమి సందర్భంగా మండలంలోని అమ్మవారి ఆలయాలు వేడుకలు, భక్తులతో కళకళలాడాయి. కొత్తపట్నంలోని నాంచారమ్మతల్లి, గంగమ్మతల్లి, నాగేశ్వరస్వామి ఆలయం, అల్లూరు జ్వాలముఖీ అమ్మవారు, మడనూరు, ఈతముక్కల జ్వాలాముఖీ అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. భజనలు, పాటలు, కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపట్నంలో పోలేరమ్మతల్లికి, గంగమ్మతల్లికి గ్రామోత్సవం నిర్వహించారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, స్థానిక భక్తులు పూజలు చేశారు. మహిళా భక్తులు లలిత సహస్రనామార్చన నిర్వహించారు.


దసరా పార్వేటలో ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న భక్తులు


గాంధీరోడ్డులో నిర్వహించిన పార్వేటలో శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు


అచలానందాశ్రమంలో మంచుకొండల సెట్టింగ్‌లో గోవిందమాంబ అమ్మవారు


శివప్రసాద్‌కాలనీలో పోలేరమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు


దసరా పార్వేటలో ఉత్సవమూర్తులు, దర్శించుకుంటున్న భక్తులు


పార్వేటతో రద్దీగా మారిన గొడుగుపాలెం


సంతనూతలపాడు: పార్వతీమాత అలంకరణలో అమ్మవారు


కొత్తపట్నంలో ప్రత్యేక అలంకరణలో నాంచారమ్మతల్లి


రాజరాజేశ్వరీదేవి అలంకరణలో కేశవస్వామిపేట విజయదుర్గాదేవి


లాయర్‌పేటలో బంగారపు చీరలో రాజరాజేశ్వరీదేవి

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి


కనపర్తి గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ

నాగులుప్పలపాడు: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి పనిచేయాలని డీపీఓ గొట్టిపాటి వెంకట నాయుడు సూచించారు. ముందు జాగ్రత్త చర్యలపై నాగులుప్పలపాడు మండలం కనపర్తి పంచాయతీలో ఆదివారం ఆమె పర్యటించారు. మండలంలోని తుఫాన్ షెల్టర్లను పరిశీలించి తీర ప్రాంత ప్రజలతో మాట్లాడారు. ముందుగా మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఎంపీడీఓ మహాలక్ష్మి, తహసీల్దార్ పవన్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

మద్దిపాడు: వాహనదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఎస్సై శివరామయ్య సూచించారు. ఆదివారం మండలంలోని కొస్టాల సెంటర్‌లో అధిక లోడుతో ప్రయాణిస్తున్న పలు ఆటోలను ఆపి అందులో ప్రయాణించే ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆటోల్లో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించి నడపడం చట్టరీత్యా నేరమని డ్రైవర్‌ను హెచ్చరించారు. అనుమతి మేరకే ప్రయాణికులను ఎక్కించుకోవాలని, రహదారి నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలన్నీ ఉండాలన్నారు. ప్రయాణికులు కూడా జాగ్రత్తలు వహించాలని ఆయన సూచించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీగిరి గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి వెంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణను శనివారం ఉదయం జోరువానలోనూ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధా రమణగుప్తాజంధ్యం, కోశాధికారి వలేటి కృష్ణారావు, సహకార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొని పర్యవేక్షించారు.

సంక్షిప్తంగా

ముగిసిన శ్రీగిరి శ్రీవారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఆలయ అర్చకులు శ్రీవారికి తోమాల సేవ, సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉభయ దేవేరులతో శ్రీగిరి తిరువీధులలో స్వామివారు విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు

ఒంగోలు మెట్రో: రాజరాజేశ్వరీ అమ్మవారి అనుగ్రహం ఉంటే అన్నింటా విజయం లభిస్తుందని ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు నెమ్మాని సీతారామమూర్తి అన్నారు. దసరా పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో అష్టాదశ శక్తిపీఠముల గురించి వివరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోహరి చంచలరావు, కమిటీ సభ్యులు, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, ఆధ్యాత్మిక గాయకుడు ఇనమనమెళ్లూరి మురళీకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దేవి వైభవం...

దేవీశరన్నవరాత్రి మహోత్సవాలలో శ్రీశైల భ్రమరాంబికా అమ్మవారు దశమిరోజు పరిపూర్ణమైన రూపంలో భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహిస్తుందని ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు శ్రీనివాసులు తెలిపారు. ధర్మనిధి వేదికపై ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచనంలో దేవీశరన్నవరాత్రి వైభవంపై ఆయన ప్రవచించారు.

అలరించిన సంగీత విభావరి

ఒంగోలు మెట్రో: జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శనివారం సాయంత్రం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక, జిల్లా రంగభూమి కళాకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమానికి సభాధ్యక్షునిగా బేతంశెట్టి హరిబాబు వ్యవహరించారు. ఇటీవల మరణించిన రంగస్థలం ప్రముఖులను స్మరించుకున్నారు. గాయనీగాయకులు ఆలపించిన గీతాలు అలరించాయి.

సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించాలి

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు కోరారు. సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయ సమావేశపు హాలులో అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చప్పిడి కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా, దళిత హక్కుల పోరాట సంఘ అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్లా వసంతరావు, ఎద్దు శశికాంత్‌భూషణ్, దండేల కృష్ణ, ధర్నాసి చిరంజీవి పాల్గొన్నారు.